

# ది మెర్సీ కిల్లింగ్

తెనాలి సుశీలాదేవి

కాలసర్పాలు నన్ను పెనవేసుకుంటున్నట్టు, నా మెడకు చుట్టుకుంటున్నట్టు అనిపించింది. బలవంతాన తెరవబోయినా నిద్రమత్తులో రెప్పలు విడివడటం లేదు. నా ముఖానికి దగ్గరగా అవి బుసకొడుతున్నట్టు నా ముఖమంతా వెచ్చని ఆవిరి. 'చురుక్కు' మని పెదవిమీది కాటు....

చప్పున కళ్లు తెరిచాను. నిద్రమత్తు క్షణంలో దిగిపోయింది. నన్ను పెనవేస్తున్నదీ, నా ముఖంమీద వెచ్చని అవిర్లు చిమ్ముతున్నది, పెదవులపై కాటు వేస్తున్నది కాలసర్పం కాదు. మనిషి. మగావాడు....నా భర్తే....అయినా....

ఒక్క విసురుతో ఆయన్ని విడిపించుకుని రెప్పపాటులో మంచం దిగి నించున్నాను. నా కళ్ళు బెదురుగా చుట్టూ చూశాయి. రాత్రి మంచంమీద నాతో పాటు పడుకున్న మంగళ....

ఆయన ముఖంలోకి గుచ్చి గుచ్చి చూశాను. నా భావం అర్థమయినట్లే వుంది. 'నా గదిలో కెళ్ళి పడుకో మన్నాను.' నవ్వు పులుముకుంటున్నారు.

నాకు ఒళ్ళు కంపరం పుట్టింది. ఆయన

**1979 చక్రపాణి నాలుగవ అవార్డు పొందిన కథ**

మీదే కాదు, నామీదే నాకు అసహ్యం వేసింది. నా ఒళ్ళంతా సిగ్గుతో, అవమానంతో కుంచించుకుపోతున్నట్టు అనిపించింది.

"ఛీ....ఛీ....ఏం మనిషి మీరు ?దాన్ని పక్కగదిలోకి పంపి మీరు తలుపులు మూసుకుని లోపలికి రావటానికి సిగ్గుగా అనిపించటంలేదూ." నా కళ్ళనిండా అసహ్యం ఆయనకి కోపం తెప్పించింది.

"సిగ్గా....? ఎందుకు ? నేను కాని పని చేయటంలేదు. పరాయివాళ్ళ గదిలోకి దొంగతనంగా దూరటంలేదు."

"అయితే మాత్రం. మాంసం తింటున్నాము కదాని ఎముకలు మెడలో వేసుకుని తిరగటంలేదు ఎవరూ. వయసులో వున్న కూతురిని బయటికి పంపి పెళ్ళాం పక్కలో చేరి....ఛీ ఛీ."

"అది వయసులో వుంది కదాని నన్ను ముసలివాడు కమ్మంటావా ? నాకూ వయసుంది, యౌవనం వుంది, శక్తి సామర్థ్యం వున్నాయి. వీటన్నిటినీ మించి శరీరం మండించే కోరిక వుంది. అది తీర్చటానికి భార్యవుంది. పురాణమంతా అనవసరం. యిలా రా...."

"వద్దు. నా కిష్టంలేదు" కరుగ్గా సమాధానం చెప్పాను.

"నీ బోడియిష్టం ఎవరిక్కావాలి. అయినా యిలా మంచంమీదికి వచ్చావంటే దానంతటదే యిష్టమైపోతుంది" ఆయన కళ్ళలో తృష్ణ. అది నన్ను కాలుస్తుందా అనేట్టు. ఆ కళ్ళు తినేస్తాయనేట్టు వున్నాయి.

"నేను రాలేను. అసలు నాకు...."

"ఏమిటే బెట్టుచేస్తున్నావు. మొగుడు పిలుస్తూంటే లక్ష్యం లేనట్టు ఏమిటా పెడసరితనం" అంటూ

చప్పున మంచంమీంచి వంగి.... నా కొంగు అందుకుని.... ఆ తరువాత కొన్ని నిముషాలపాటు నాకు లభించిన శారీరక సుఖం ఏమిటో తెలియలేదుగానీ ఆ కాసేపు కొన్ని యుగాలన్నట్టు చిత్రవధ అనుభవించాను మానసికంగా.

"చూడండీ! యిదేం బావులేదు. వయసులో వున్న పిల్ల కోరికలను చంపుకుంటూ, కుమిలి కుమిలి పోతూంటే మీరిలా...."

గుర్రుకొడుతున్న ఆయన్ని చూసి అసహ్యం వేసింది. నా నిస్సహాయ స్థితికి దుఃఖం ముంచుకొచ్చింది.

"మంగళ....నా మంగళ....నా తల్లి ఎక్కడ....ఎక్కడ.... బట్టలు సర్దుకుని తల సవరించుకుని మెల్లిగా తలుపులు తెరచుకొని వెళ్ళాను. ముందుగది తలుపు తోశాను. లోపల గడియపెట్టినట్టుంది. లైటు వెలుగుతున్నట్టు తెలుస్తోంది. గదిలోంచి పెరటివైపుకున్న కిటికీ కేసి నడిచాను. కిటికీ తలుపులు పూర్తిగా మూసి లేవు. లోపలికి చూసిన నేను నిశ్చేష్టురాలనై పోయాను. లోపల.... మంగళ....గాడ్రెజ్ బీరువాకున్న నిలువు

టద్దంముందు నుంచుని వుంది. దాని ఒంటిమీద వుండాల్సిన బట్టలు మంచం మీద కుప్పగావేసి వున్నాయి. నగ్నంగా వుంది. రెండు చేతులు రొమ్ములమీద కప్పుకుని.... వుద్రేకంతో రొప్పుతోంది. తీస్తున్న ఆ వూపిరి వేగానికి దాని ఒళ్ళు పొంగుతోంది. ఏహ్యం కలిగిస్తున్న ఆ దృశ్యాన్ని ఎంతసేపో చూడలేక పోయాను.

'మంగళా' తలుపులు తట్టాను. అవి తెరుచుకోడానికి కాసేపవుతుందని నాకు తెలుసు.

తలుపులు తీసిన మంగళ నాకేసి చూసింది. ఆ చూపు గురిచూసి వేసిన బాణంలా నాకు గ్రుచ్చుకుంది. మరుక్షణం ఆ కళ్ళు కిందికి వాలిపోయాయి.

"ఏమ్మా...."

ఏదో అనబోయింది. ఆ కంఠ స్వరంలో తడబాటు, గాబరా, పిరికితనం సన్నగా వణుకుతోంది నిలువెల్లా. ఆదరా బాదరా చుట్టబెట్టుకున్నట్లు అస్తవ్యస్తంగా బట్టలు. నన్నుచూడటానికి తనెంత సిగ్గు పడుతుందో అంతకు రెట్టింపు అవమానంగా వుంది నాకు.

"అబ్బ! ఈ గదిలో హాయిగా వుందే మంగళ. కిటికీలోంచి గాలి ఎంత చల్లగా వీస్తుందో. పడుకుందాం రా" అతుకులేస్తున్నట్టున్నాయి నా మాటలు. మౌనంగా అనుసరించింది. ఆ పెద్ద మంచంమీద యిద్దరం పక్క పక్కనే పడుకున్నాం. ఒకర్నొకరం చూసుకోటం లేదు. యిద్దరం కళ్ళు మూసుకునే వున్నాం. కాని యిద్దరికీ తెలుసు అది నిద్ర కాదని. మూసిన ఆ రెప్పల వెనుక ఎదుటి కళ్ళు కలతతో చెదురుతున్నాయని.

వలపును పెంచుకుంటూ ఆనందం పంచుకుంటూ అనుభవాలను జుర్రుకుంటూ యీ పరుగులో అలిసిపోయి వున్నదాన్ని నేను. వాటిని అందుకోటం కోసం యిటీవలే పరుగు ప్రారంభించిన వుత్సాహం దానిది. కాని ఎంత చిత్రం? భగవంతుడు ఎంత నిర్దయుడు? ఎంత కసాయివాడు.

అలసిపోయివున్న నన్ను యింకా పరుగులు తీయిస్తున్నాడు. కాని వుత్సాహంతో ముందుకు వురికిన నా మంగళ ....మంగళకు ఏ రాయి తగిలిందో, ఏ క్రూర శక్తి అడ్డుపడిందో....బొక్కబోర్లా పడిపోయింది. ఆ పడటం యింక మళ్ళీ జీవితంలో పరుగుపెట్టే ఆశ లేకుండా పోయింది. ఆ ఆశలు, ఆ కోరికలు, ఆ ఆనందాలు, అనుభూతులు వూహల్లో మాత్రమే చవిచూడమని, జీవితంలో అనుభూతులే తప్ప యింక అనుభవాలకు తావులేదనే భయంకర సత్యం దాన్ని వెన్నాడుతూనే వుంది. జీవిత మాధుర్యానికి ఆ పిల్లను దూరం చేసింది. నుదుటి కుంకుమ తుడిచి దాని బ్రతుకే బండలు చేసింది.

కన్నబిడ్డ, వయసు మురిపాలలో తేలవలసిన పడుచుపిల్ల జీవితం యౌవనం మోడువారిపోయి ఎండిపో తూంటే దాన్ని కన్నతల్లిని నేను, నేను యింకా....యింకా పైగా దానికి తెలిసే విధంగా....రగులుతున్న నా గుండెల్లో సెగలు. ఆ సెగలలో నా మనసు చిత్ర విచిత్రంగా తాను పొందిన పరిణామాలు నెమరువేయసాగింది,

"విప్పలు కడిగే ఆచారం వాళ్ళది. సోమయాజుల కుటుంబం. వాళ్ళ పూర్వీకులు యజ్ఞ యాగాలు చేసిన గొప్పవాళ్లు."

యివీ నాన్న మాటలు తను తెచ్చిన పెళ్ళి సంబంధం గురించి. అప్పుడంతా యిప్పటిలాగా ఎంతసేపూ డబ్బూ, హోదా, అంతస్థు, వుద్యోగాలు చూసే రకం కాదు. ఎంత సదాచార సంపన్ను లయితే అంత గొప్ప. వాళ్ళ అచార వ్యవహారాలు వింటూంటే తనకే కాదు, తల్లికి కూడా భయమే వేసింది.

"మనమ్మాయి పసిపిల్ల. ఆ యింట్లో నెగ్గుకు రాగలదంటారా?"


"పిచ్చి మొహమా. మనమ్మాయి కేమే. అది ఎలాంటి యింట్లో పుట్టింది. ఆ యింటి కోడలిగా ఎలా రాణిస్తుందో ఎట్లా పేరు తెస్తుందో చూస్తావుగా," అన్నాడు నాన్న.

ఆనాటి భయం నా గుండెల్లో అలాగే నిలిచిపోయింది. ఆడపిల్లనయిన కారణంగా నేను చదువుకోలేదు. సాంప్ర దాయాలను పట్టుకుని వ్రేలాడే చాదస్తుల కుటుంబంలో పుట్టి అలాంటి యింటనే మెట్టి సరిగ్గా అలాంటి చాదస్తుడికే భార్యనయినదాన్ని.

వయసొచ్చిం దొచ్చింది. పెద్దమనిషి అయిందన్నారు. అదేమిటో సరిగ్గా తెలియకముందే పెళ్ళి పెళ్ళి అంటూ హడావుడి. 'అసలు పెళ్ళంటే ఏమిటి?' 'పెళ్ళంటే నూరేళ్ళ పంట' అనే పెద్దల మాట వినడమే తప్ప ఆ పంట ఎలాంటిదో, ఎలా పండిస్తారో....ఎలా అనుభవిస్తారు అన్నది మాత్రం తెలియని వయసు. అబ్బాయి బావున్నాడు. సాంప్ర దాయమైన కుటుంబం. యింతే నాకూ అమ్మకు తెలిసిన వివరాలు.

మెడ, తల నొప్పి పెడుతూంటే బిగదీసివేసిన మొగిలిరేకుల జడలు, అలవాటులేక ఒంటిమీద నిలువకుండా జారిపోయే పట్టుచీర, అందరూ ప్రత్యే కించి నా చుట్టూ తిరగటం, నాకు మహా రాణికిలాగ సపర్యలు చేయటం, పెట్రొ మాక్సు లైట్ల వెలుతురులో, బ్యాండు మేళాలతో కారులో వూరేగటం, పన్నీరు చల్లుకోటాలు, పూలబంతులాటలు, ఒళ్ళంతా బరువుగా దిగేసుకున్న నగలు, అర్థం అయీ కాని హాస్యాలు యెంతో సంబరంగా అనిపించింది.

విప్పను నీళ్ళతో కడిగే వంశం అని విన్నాను కానీ ఆ ఆచారం విప్పలమీద




నడిచినట్టుగా వుంటుందని కాపురానికి వెళ్ళాకనే తెలిసింది. పగలు భర్తతో మాట్లాడకూడదు. రాత్రిళ్లు అయినా అందరూ పడుకున్నాకే గదిలోకి వెళ్లాలి. ఒక్కళ్ళూ లేవకముందే గదిలోంచి బయటికి రావాలి. పెద్దవాళ్ళు తిరుగుతూండగా కూర్చోకుండా ఎంతసేపైనా పరే నించునే వుండాలి. యిక బయట చేరిన ఆ మూన్నాళ్ళు నరకం. బంది ఖానా. మడితో వంటలుచేసి వాళ్ళందరి భోజనాలు ముగిసేదాకా అత్తగారికి తను కనబడటమే కాదు మాట కూడా వినిపించకూడదు. మగవాళ్ళెవరితో మాట్లాడవలసివచ్చినా తలుపు చాటునుండే మాట్లాడాలి.

ఇక భర్తంటే ఎంత ప్రేమో అంతకు రెట్టింపు భయం. ఏదయినా అడిగిన దానికి జవాబు చెప్పాలన్నా పాదాల్లోంచి వణుకు. మౌనంగా వుండాలన్నా భయం. పెదవి విప్పి ఏదయినా చెప్పాలంటే మనసులో పదిమార్లు ఆ మాటలు మననం చేసుకుంటేగాని బయటికి వచ్చేవి కావు. ఆ గదిలోకి వెళ్ళగానే కీలుబొమ్మలా మైనం బొమ్మలా మారిపోయేదాన్ని.

ఆ యింట్లో నాన్నగారు ఆశించినట్టుగా ఆదర్శ గృహిణిగా పేరు తెచ్చుకున్నాను. సదాచార సంపన్నురాలయిన యిల్లాలుగా, కోడలిగా పేరు తెచ్చాను. ఒక విధంగా పిల్లల తల్లినయ్యాక నాకంటూ ఒక వ్యక్తిత్వం వుందనిపించింది.

మా యింట్లో పెద్దలతరం అంతరించిపోయాక నాకు కొంత స్వేచ్ఛ లభించినట్లయింది. కళ్ళముందు కనబడే కొందరు జీవితాలని పరిశీలించి చూస్తూంటే

నే నెంతో కోల్పోయినట్టు, తిరిగి దానిని తెచ్చుకోలేనట్టు దిగులుగా వుండేది. నేను కోల్పోయినవి, నాకు లభించనివి. నా పిల్లలకయినా అమర్చిపెట్టా లను కున్నాను. నాలోనూ, నా ఆలోచల్లోనూ మార్పులు వచ్చాయి కానీ సాంప్ర దాయాలు పట్టుకుని ్రవేలాడే మావారిలో ఛాందస భావం ఏమాత్రం తగ్గలేదు.

తొలిసారిగా నాకు ఆడపిల్ల పుట్టింది. నేను రోజూ కొలిచే ఆ రాజరాజేశ్వరే పుట్టిందని సంతోషించాను. ఆ పిల్ల జీవితం శోభాయమానంగా వెలగాలని, దాని బ్రతుకంతా మంగళకరంగా సాగి పోవాలని ఎంతో ఆశతో, ఎంతో యిష్టంతో 'సర్వమంగళ' అని పేరు పెట్టుకున్నాను.

ఆధునిక సౌకర్యాలు మా యింటి దాకా వచ్చే అవకాశం లేదు గనుక ముప్పయి ఏళ్ళకే ఐదుగురి పిల్లలకు తల్లినయ్యాను. ఒక్కతే ఆడపిల్ల అయిన మంగళను అపురూపంగా చూసు కున్నాను.

"అమ్మా! నాన్న స్కూలుకు వెళ్లా ద్దంటున్నారు," మంగళ ముఖంలో తన సర్వస్వం ఎవరో దోచుకుపోయి నట్టు దైన్యం.

ఆయన్ని అడిగాను. "నిజమేనా? ఎందుకని?"

"నీకు తెలీదూ వన్నొచ్చి అడుగు తున్నావా? సమర్తాడిన పిల్ల తైమంటూ స్కూలుకు వెడితే...."

"ఆ కాలం పోయింది. యిప్పుడు ఆడపిల్లలు మగపిల్లలతో సమంగా చదువుతున్నారు." నే నన్న మాటల్లో తప్పేం వుందో తెలియలేదుగానీ ఆ మాటలకి ఆయన చూసిన చూపు బాణంలా తాకింది.

"ఎంత మందో ఎన్ని చోట్లకో వెళతారు. కాని నా పిల్లలు అలా బజా ర్లమ్మట సానిపాపలా తిరగటం నేను సహించను. మా యింటా వంటా లేవు అలాంటి పాడుబుద్ధులు. అనాచారపు పనులు."

అవి పాడు పనులో, మంచి పనులో కాని మా యింట్లోనూ అలాంటి పద్ధతులే వుండేవి. కాని యిప్పుడు కాలం మారింది. అయినా మనుషులు మాత్రం అందరూ మారలేదు కదా.

కొన్ని కొన్ని సంఘటనలు తలుచు కుంటే కొన్ని పద్ధతులు ఎలా వుండ కూడదో, కొన్ని ఎంత అవసరమో, జీవితమంటే ఎలా వుండాలో చాలా జీవితం గడిచిపోయాక నే అర్థం అయింది నాకు. సాగనీ, సాగకపోనీ నా యిష్టా యిష్టాలు వెలిబుచ్చేంత ధైర్యం మాత్రమే వచ్చింది నాకు. తూనీగలా ఎగురుతూ ఆడుతూ పాడుతూ చదువు కొనే అమ్మాయిని బడిమానిపించి పెళ్ళి సంబంధాలు వెతుకుతూంటే మొదటి సారిగా వ్యతిరేకించాను. నా అభిప్రాయం వెలిబుచ్చాను.

"నలుగురితో పాటు చదువుకొని బాగా లోకజ్ఞానం తెలిశాక దాన్ని ఓయింటి దాన్ని చేస్తే బావుంటుందేమో" ప్రాధేయ పూర్వకంగా అడిగాను. ఆయన్ని ఒప్పించాలని నేను చేసిన ప్రయత్నం విఫలమే అయింది.

'మంగళ' పెళ్ళి కూతురయింది. కన్నీళ్ళమధ్య వీడ్కోలిస్తూ అత్తవారింటికి వెళ్ళిపోయింది. కళకళలాడుతూ పుట్టింటికి తిరిగిరావలసిన ఆడపిల్ల నెల తిరక్కుండానే వెలవెలబోతూ కన్నీళ్ళతోనే తిరిగి వచ్చింది. మంగళప్రదమయిన జీవితంలోకి అడుగుపెట్టగానే దాని బ్రతుకు మంగళం పాడేశాడు ఆ పాడు దేవుడు

నా కన్నకడుపు తల్లడిల్లిపోయింది. పెళ్ళికోసం యింటికి వేసిన వెల్లమాయనయినా లేదు. పెళ్ళికి తెచ్చిన సరుకులు యింకా మిగిలే వున్నాయి. కాని నిత్య శోభాయమానంగా, మంగళ ప్రదంగా సౌభాగ్యవతిగా జీవితం గడుపుతుందన్న అ పెళ్ళికూతురు నా కన్నకూతురి సౌభాగ్యం మాత్రం మట్టిలో కలిసిపోయింది.

ఇప్పుడు దాని పేరు మాత్రమే 'మంగళ'. మంగళ చిహ్నాలు మాత్రం ఒక్కటీ లేవు. దాని దాంపత్య జీవితపు ఆయుష్షు అంత అల్పమని అనుకోలేదు. అమావాస్య చీకటిలాంటి దాని బ్రతుకులోకి వెన్నెల ఎలా వస్తుంది? యింక ఆ పిల్ల జీవితమంతా శూన్యమేనా.

ఆడపిల్లకు వయసు వచ్చి, వాంఛలు కలిగి, కోరికలు చెలరేగే తరుణానికి దాని జీవితం మోడువారిపోయింది. ముచ్చటగా భర్తతో కాపురానికి వెళ్ళవలసిన వయసుకి అన్నీ ముగించుకుని పుట్టింటికి చేరుకుంది. దీని బ్రతుకు ఎలా వెళ్ళమారుతుంది? 'ఎన్నాళ్ళు?' ఎన్నేళ్ళు గడిస్తే దీని జీవితం పూర్తి అవుతుంది. ఈ జీవిత నాటకరంగంలో ఎప్పుడే రంగం వస్తుందో ఎప్పుడు తెరవాల్తుందో ఎవరికి తెలుసు? నా ఆలోచనలు ఎంత దూరం ప్రయాణం చేసినా శూన్యంలోనే తప్ప వాటికి గమ్యం మాత్రం మృగ్యమయింది

మంగళా! "నీవూ పిల్లలు అంతా హాల్లో పక్కలు వేసుకొని పడుకోండి." భోజనం ముగించి లేచి వెళ్ళబోతూ అన్నారు ఆయన.

ముఖంలో నెత్తురుచుక్క లేనిదానిలా అయిపోయాను. మంగళకేసి చూశాను. వాళ్ళ నాన్న మాటలకి 'అలాగే' అని సమాధానం చెప్పలేదు కానీ తలమాత్రం వూపింది. అ తలఎత్తి నావేపు చూడలేకపోయింది. వంచిన దాని కళ్లలోంచి కన్నీటి బొట్లు అన్నంలో పడ్డాయి.

ఒక్క క్షణంకూడా మంగళ ఎదురుగా నించోలేకపోయాను. మజ్జిగగిన్నె దాని కంచంముందు పెట్టేసి యివతలికి వచ్చేశాను.

గదిలో భరిణిలోంచి వక్కపొడి తీసుకుంటున్న ఆయన నన్ను చూసి అదోలా నవ్వారు. ఆ నవ్వుకు ఎన్ని మార్లో నా శరీరం పులకరించినమాట నిజం. నా మనసు పరవశించిన మాట నిజమే. కానీ యిప్పుడు యీ క్షణాన ఆ నవ్వు నా వంటిమీద తేళ్ళు, జెర్రులు ప్రాకుతున్నట్టుగా అనిపించింది. నా మనసులో దావాగ్ని రేపుతోంది. ఎంత కోపంగా ఆవేశంగా వచ్చానో ఆయన్ని చూసేసరికి నీళ్ళుగారిపోయాను. ముందు నుండీ వుండే కదూ ఆ ధైర్యం. అయినా నన్ను నేను సంబాళించుకున్నాను.

'ఎలా అడగాలి.... ఏమని....' ఒక్కసారి మనసులో మననం చేసుకుని ....

"మీ పడక వరండాలో వేయమన్నారా?"

"అర్థం కానిదానిలా మాట్లాడకు. పిల్లలందరినీ హాల్లో పడుకోమన్నది నేను వరండాలో పడి జాగరణ చేయడానికి కాదు."

"అదికాదు... అహ.. బావుండదు..." ఎలా చెప్పాలో తెలీక నీళ్ళు నమలసాగాను.

"అంతా బాగానే వుంటుంది. నేను చెప్పినట్టు చేయి. రోజులు, నెలలు, ఒంటిపక్షిలా పడివుండటానికి నేనేం సన్యాసిని కాదు" తీవ్రంగావుంది మాట. అది ఒట్టిమాటే కాదు. ఆజ్ఞ కూడా.

"నేను చెప్పేది కాస్త వినండి. పసిపిల్ల అది. బంగారంలాంటి బ్రతుకు మోడుబారిపోయి లోలోపలే కుమిలిపోతోంది. దాని ఎదురుగా మనం...."


"దాని ఖర్మ అట్లా కాలింది. ఎవరేం చేస్తారు. దానితోపాటు ఏడుస్తూ మనమూ మొండి బ్రతుకు బ్రతకాలంటావా? యింతకుముందే చెప్పాను. నేను సన్యాసిని కాదు అని. అలా బయటికి వెళ్ళొస్తాను. పక్కలు పరిచి పిల్లలు త్వరగా నిద్రపోయేలా చూడు."

తనకేం పట్టనట్టుగా ఎంత వుదాసీనంగా వెళ్ళిపోయారు నాకు మాత్రమేనా యీ రంపపు కోత. కన్న తండ్రిగా ఆయనకే బాధలేదా? దిగులుగా గదిలోంచి బయటికి వచ్చాను. హాలులో మంగళ నా కోసమే కాచుకున్నట్టు నిలబడి వుంది మా మాటలు విని వుంటుందా?

"అమ్మా యిదిగో."

దెబ్బతిన్న పిట్టలా చూశాను దానివేపు. నా గుండె ఎవరో పిండుతున్నట్టుగా అయింది. మంగళ దోసిట్లో సాయంత్రం కట్టిన జాజిపూలదండ. గాజులు లేని బోసిచేతుల దోసిలిలో అప్పుడప్పుడే విచ్చుకుంటున్న జాజులు. దాని కళ్ళలో వూరుతున్న నీళ్ళు.

'భగవంతుడా యీ శిక్ష ఏ కన్నతల్లికీ వద్దు తండ్రీ. ముక్కుపచ్చలారని యీ పిల్ల పసుపు కుంకుమలకూ,



పరిమళించే పూలకు దూరమయి కళ్ళముందు జీవచ్ఛవంలా తిరుగుతూంటే దాని కళ్ళముందు సింగారించుకుని భర్త గదిలోకి వెళ్ళవలసి రావటం దాని కన్న తల్లిగా నాకెంత రంపపు కోత.

నా మౌనం చూసి ఏమనుకుందో తనే నా వెనక్కు వచ్చి పువ్వులను నా జడలో తురిమి సవరించింది. మరొక్క మాట మాటాడకుండా చరచరా వెళ్ళి పోయింది. రెండు నిముషాలు ఆగి దాని వెనుకే గదిలోకి వెళ్ళబోయి .... గది గుమ్మం దగ్గరే నా పాదాలు నేలకంటుకు పోయినట్టు నిలుచుండిపోయాను. నా గుండెలమీద సుత్తితో కొడుతున్నట్టు బాధ.

మంగళ .... ఆ పెద్ద మంచంమీద మా పడక విదిలించి పరుస్తోంది. 'స్వీట్ డ్రీమ్స్' 'ఐ లవ్ యూ' దిండ్లు చేతుల్లో తీసుకుని వాటికేసే చూస్తూ.... ఆ పేర్లు పెదవులతో చదువుకుని రెంటిని పక్క

మీద సర్దింది. రగ్గును మడతపెట్టి మంచం చివర కాళ్ల తట్టు పెట్టింది. గదిలోంచి బయటికి రాబోతూ నన్ను చూసి క్షణం ఆగి మెల్లిగా వెళ్ళిపో యింది. బొమ్మలా అలాగే నిలబడి వున్నాను నేను. మంచినీళ్ళ చెంబు స్టూలు మీదుంచి దానిమీద గ్లాసును బోర్లించి వెనక్కి తిరగకుండా రెండు నిముషాలు అలాగే నుంచుంది. నేను కదలబోయాను. చప్పున వెనక్కి తిరిగి వచ్చేయబోతూ గడప దగ్గర ఆగివున్న నా ముఖంలోకి కళ్లెత్తి చూసింది. అప్పటిదాకా దించుకున్న ఆ రెప్పల వెనుక వూరుతున్న నీళ్ళు యిక ఆగలేక బుగ్గలమీదికి జారాయి. దోసిట్లో ముఖం కప్పుకుని ఒక్క పరుగున వెళ్ళిపోయిం దక్కడినుంచి.

ఒకసారి వూహించి చూడండి అప్పటి నా మనస్థితి ఎలా వుంటుందో. కూతుర్ని ముస్తాబు చేసి, పక్క లు అలంకరించి గదిలోకి పంపే తల్లిని సిగ్గుతో చూడాల్సిన కూతురు.... యిప్పుడు తల్లిని అలంకరించి, గదిని సర్ది ....

ఆ రాత్రి....మంచం మీద పడుకుని ఆయన రమ్మని తొందరపెడుతూంటే.... పక్కమీద నిద్రపట్టక అటూ యిటూ దొర్లుతున్న మంగళని చూస్తూ గది తలుపులు మూయలేక లోపలికి వెళ్లలేక, వెళ్లకుండా వుండలేక నేను అనుభవిం చిన నరకం యిలాంటిదని చెప్పలేను.

ఓనాడు .... పెరట్లో దోకుల్తుంటు న్నాను. మంగళ పరుగున వచ్చి పట్టుకుంది.

'ఏమ్మా. ఏమయింది? ఒంట్లో బావుండలేదా.' దాని ముఖంలో ఆదుర్దా దాని కళ్ళలో అపేక్ష.

నా ఒళ్లు సిగ్గుతో చచ్చిపోయింది. ఏమని చెప్పేది. కారణం 'ఫలాన' అని దాని ముఖం చూస్తూ నోరువిప్పి చెప్ప గలనా.

'ఏంలేదమ్మా. ఎండకి పైత్యం చేసినట్టుగా వుంది.' ముఖం తప్పించుకుని తొందర తొందరగా లోపలికి వచ్చేశాను. మంగళకి అనుమానం వచ్చినట్టే వుంది. ఏంలేనట్టుగా ఎంతగా తప్పించుకు తిరిగినా నాతో కూడా యింట్లో తిరిగే ఆడపిల్ల కదా.

మంగళ మేలుకుని వుండగా గది లోకి వెళ్ళి పడుకోవాలంటే చచ్చిన చావుగా వుండేది నాకు. నా అవస్థ గమనించి కాబోలు భోజనాలు అవగానే పడకలు పరిచేసి నిద్రవచ్చినా రాక పోయినా పడుకొనేసేది.

ఈ మారు ఆయన పర్మిషన్ తీసు కోడం కాదు గదా కనీసం నెల తప్పినట్టు కూడా తెలియపరచకుండా నాటు వైద్యంతో భారం దింపేసుకున్నాను. కాని ఒళ్లు చాలా బలహీనమయి పోయింది.

విషయం తెలుసుకుని ముఖం వాచేలా

చివాట్లు పెట్టారు. ఆ తరువాత. అవేవీ నాకేం బాధ కలిగించలేదు.

'ఎందుకమ్మా యిట్లా చేశావు.' అని ఒకే ఒక్కమాట అడిగింది మంగళ. ఎందుకని చెప్పేది? కాన్పులకు పుట్టింటికి తీసుకొచ్చి కూతురికి పురుళ్ళు పోయ వలసిన తల్లిని, తలచెడి ఆ పసిపిల్ల యింటికొస్తే దాన్ని చాటుచేసుకుని కులికింది కాక కూతురితో పురుడు పోయించుకుని, చాకిరీ చేయించుకోటం యిష్టంలేక మొహంచెల్లక అలాచేశానని చెప్పనా?

ఒంట్లో అనారోగ్యంగా వుండటంతో నేను లోపల పడుకోటం మానేశాను. మంగళ, నేను ముందుగదిలో పడుకుని పిల్లలకు హాల్లో వేసేవాళ్లం. కొద్ది రోజులు అలా జరిగింది కానీ చాలా రోజులు మాత్రం జరగలేదు. తన ఒంటరితనానికి ఆయనకి విసుగు ఎక్కువయిపోయింది.

"ఇంకా ఎన్నాళ్లు? నీ రోగం తెగేలా లేదు." అన్నారొకరోజు.

"రోగం బాగయినా యింతే. నేనింక రాలేను." తెగేసి చెప్పాను.

"అయితే యింక యిట్లా వుండిపోద మేనా. అది చచ్చేవరకూ యిక్కడే వుంటుంది. దానికోసం ఎన్నాళ్లని యిట్లా...."

"మీరేమయినా అనండి. దాని ముందు యిలా కలుసుకోవడం, నెల తప్పటం యిదంతా నాకు చాల సిగ్గుగా, అవమానంగా అసహ్యంగా వుంది."

యింతలో మంగళ రావటంతో మరేం అనలేకపోయారు.

ఆ కోపం ఏ విధంగా తీర్చుకున్నా తీరకపోడంతో అందుకు కారకురాలయిన మంగళమీద కసి మొదలైంది ఆయనకి. తరచూ ఆయన ఆగ్రహానికి గురి కాసాగింది. కసి, పగ పుట్టుటమంటూ జరిగితే అది 'యింతింతై వటుడంతై' అన్నట్టు పెరుగుతుందే తప్ప తరగదు. దాని ముఖం చూస్తేనే మండిపడే స్థితికి వచ్చారు.

ఖర్మకాలి ఆయన వుదయం నిద్రలేచి వచ్చేసరికి కనబడిందో ప్రళయ రుద్రులయ్యేవారు. చేతిలో ఏదయినా వుంచే దాని ముఖాన విసిరి కొట్టేవారు.

"భ్రష్టు ముండా! మూల నెక్కడయినా తగలడి వుండక తగుదునమ్మా అని ఎదురయ్యావు! జేష్టా.... నీకు పోయే కాలం వచ్చిందే.... దరిద్రపు ముఖమా...." యిలా సాగేది ఆయన ధోరణి.

ఆ మాటలంటున్నపుడు దాని ముఖంలో కనబడే వేదన, అవమానము కళ్ళలో యిమడలేక క్రిందికిజారే కన్నీటి ధారలు నా గుండెని పిండేసేవి.

ఇవన్నీ తను కన్నకూతురినే అంటున్నానని, భగవంతుడు అన్యాయం చేసిన ఆ బిడ్డను, కడుపులో దాచుకుని ఓదార్చ

వలసిన ఆ పసిపిల్లను గాయపరుస్తు న్నానని ఆయనకి ఎందుకనిపించదో నాకు అర్థంకాదు. భోగలాలస ముందు మమకారాలు తృణీకారాలేనా.


ఈ దీవెనలన్నీ నా నుండి దక్క వలసిన సుఖం జారిపోయిందనా? తన సుఖ సంతోషాలకు ఆ పిల్ల అడ్డుగా వుందనా. ఎంత సమాధాన పరచుకున్నా రాత్రయ్యే సరికి దాన్ని అలా ఒంటరిగా వదిలేసి వెళ్ళలేక పోయేదాన్ని. అయినా నా ప్రవర్తన వలన ఆయనకి కలుగు తున్న అసహనానికి, మాయిద్దరి మధ్య మంగళ నానామాటలకు గురికావటం సహించలేకపోయాను. దానికి తోడు ఆ రాత్రి ఆయనే వచ్చేసి మంగళని లేపి తన గదిలోకి పంపేసి నా పక్కని చేర టంతో యిది మరీ అసహ్యంగా అవ మానంగా వుందనిపించింది. దాంతో నా మనసు చంపుకున్నాను. ఆయనను చల్లబరచాను. ఇంట్లో కాస్త శాంతి నెలకొనిందే కాని ఆ పిల్ల గుండెల్లో అగ్ని జ్వాలలు రగులుతూ వుంటాయని నాకు తెలుసు

ఒక్కోరోజు వుదయం నిద్ర లేచే సరికి దాని కళ్ళు ఎర్రగాఅయి వుబ్బి నట్లుగా వుండేవి. నా శరీరం ఆయన చేతుల్లో నలిగేదేకాని నా మనస్సు ఆ క్షణాలలో మంగళను తలుచుకుని ఆక్రోశిస్తూండేది.

ఓనాడు అందరం పడుకున్నాక కాపే పటికి పెరట్లోకి వెళ్లాల్సి వచ్చి గది తలు పులు తీశాను. వూహించలేదేమో తలుపు లానుకుని నించున్న మంగళ వులిక్కి పడింది. నా గుండెల్లో రాయి పడింది. ఆ క్షణాన నేను దానికేసి చూసిన చూపు ఎలా వుండిందో కాని తల వంచుకుని మెల్లిగా కదిలిపోయింది. వెళ్ళి తన పక్కమీద పడుకుంది.

అయితే రోజూ....మంగళ.... నేను తలుపులు మూసుకుని లోపలికి వెళ్లాక... తలుపుకున్న కన్నంగుండా.... భగవం తుడా.... తల్లీ తండ్రీ యిలాంటి స్థితిలో బిడ్డలె కంటపడటం.... నా ఒళ్లు జలద రించింది. సిగ్గుతో చచ్చినట్టు అయి పోయింది. యీ మంగళ ఎన్ని రోజు లుగా .... ఎన్ని రాత్రిళ్ళు....ఏయే రకా లుగా .... ఏ భంగిమలలో మమ్మల్ని చూసిందో.... ఛీ! సిగ్గయినా లేదూ? తల్లీ తండ్రీ కదా. అలా చూడటం తప్పనే జ్ఞానమయినా వుండొద్దూ....

సముద్రంలో అలలాగ వుప్పెత్తున కోపం పొంగింది. యీ మాటలే అడగా లని దాన్ని సమీపించాను. మూసిన రెప్పల మాటునుంచు జారిన కన్నీళ్ళ బుగ్గలమీద చారలు కట్టివున్న మంగళను చూడగానే ఒడ్డును తాకిన అలలాగ నా కోపం విరిగిపోయింది. ఆవేశం కరిగి పోయింది. నా కెందుకో ఆక్షణాన సిగ్గని పించలేదు. అవమాన మనిపించలేదు. మంగళ ప్రక్కనే పడుకుని, దాని




మీదుగా చేయివేసి దగ్గరికి పొదువుకున్నాను. అప్పటిదాకా అడ్డుకట్టలు వేసుకుంటూ ఆపి ప్రయత్నించిందేమో, చల్లగాలి తగిలిన మేఘంలాగా కరిగిపోయి వర్షించింది. నా గుండెల్లో దూరిపోయింది. వెక్కిళ్ళ మధ్య దాని వేదన నన్ను చిత్రవధ చేసింది.

ఆ రోజు తర్వాత ప్రతిరాత్రి మంగళ ఎక్కడినుంచయినా నన్ను చూస్తోందేమోననే జంకు నన్ను వెంటాడేది. 'చీకట్లో శృంగారం జరిపితే గుడ్డిపిల్లలు పుడతారు,' అని బెడ్‌లైట్ వేసే వుంచేవారు ఆయన. తలుపుకి ఒక కర్టెన్‌కూడా కట్టాను. ఎటువంటి స్థితిలోవున్నా మేలుకుని వున్నంతసేపూ నా చూపులు అలా చుట్టూ పరికిస్తూనే వుండేవి.

కొన్నాళ్లు అట్లా మామూలుగా గడిచిపోయింది. ఈ మధ్య మంగళలో కొద్దిగా మార్పు కనబడుతోంది. బొట్టూ, కాటుకా తీర్చుకోకపోయినా చాలాసేపు అద్దంముందు నించోటం, దువ్విన తలనే దువ్వటం, కట్టిన చీరనే మళ్ళీ మళ్ళీ విప్పి కట్టటం, రకరకాల భంగిమలలో అద్దంలో చూసుకోవటం ఆ వయసులో అవన్నీ సహజమే అయినా అ చేస్తున్నది మంగళ. అలంకారాలకు అనర్హురాలయిన మంగళ అవటంతో అసహనం కలిగేది. వెనువెంట జాలివేసేది. యీ అందం, చందం, కులుకు, హొయలు, ఏం చేయను?

రోజూ పుదయం పది గంటలయ్యేసరికి ఏపనిలోవున్నా సరే వదిలేసి వెళ్ళిపోయేది. మొదట్లో నేనంతగా గమనించలేదుగాని అది పోస్ట్‌మాన్ కోసమే కాచుకుని వుందని తరువాత తెలుసుకున్నాను. అంత ముఖ్యమైన వుత్తరాలు రోజూ ఏం వస్తాయి వూరికే నుంచోటం

తప్పు అనుకున్నాను గానీ అది అక్కడ కాచుకుని చూడటం పోస్ట్‌కోసం కాదని, అవి తెచ్చే కుర్రాడి కోసమని రూఢీ అయిపోయింది. ఈ కొసనుండి ఆ కొస దాకా సైకిలు తోసుకుంటూ మలుపు తిరిగేదాకా అక్కడే వుండేది.

ఈ మధ్యే వుద్యోగంలో చేరాడు గా మోసు కుర్రాడు. హుషారుగా షోగ్గా వున్నాడు. ఉత్తరాలు అందిస్తూ అలా దాని కళ్లలోకి వాడూ, వాడి చూపులు ఎదుర్కొంటూ దీని కళ్ళు గమనించి కుతకుత వుడికిపోయాను. ఆశలు మనిషిని ఎంతకి దిగజారుస్తాయి. మనసు నొచ్చుకోకుండా మంగళకి ఎలా నచ్చ చెప్పాలా అని ఆలోచిస్తూ రెండు మూడు రోజులు తటపటాయించాను.

వంటింట్లో పోపు పెడుతున్న నాకు దభీ దభీమని చప్పుడయి చప్పున హాల్లోకి వచ్చాను. ఆనాడు ఆ పోస్ట్ కుర్రాడితో మాట్లాడుతూ నవ్వుతోంది. అంతదూరం నుంచే వాళ్ల నాన్న గమనించారు. అయన్ని చూసేసరికి దానికి పై ప్రాణాలు పైనే పోయాయి. సన్నగా వణుకుతూ లోపలికి వచ్చింది.

'జెష్టా! వెధవ ముండా' అంటూ ఒక్కతోపు తోశారు. గోడకి వెళ్ళి కొట్టుకుంది. అంతే 'ఛళ్ ఛళ్' అని అందిన చోట్లల్లా పడిన దెబ్బలకు ఒళ్ళు కమిలిపోయింది. ఎలా అపుకుందో గాని గొంతు విప్పలేదు. 'అమ్మా' అనయినా పెదవులు విప్పలేదు. బాధనంతా పెదిమల బిగింపుతో అదిమిపట్టింది. కొట్టి అలిసిపోయిన అయన నోటికొచ్చినట్టు తిడుతూ వెళ్ళిపోయారు.

సొమ్మసిల్లి నేలమీద అలాగే పడుకునుండిపోయిన మంగళను చూచి నా కడుపు తరుక్కుపోయింది. ఆ దెబ్బలకు అడ్డుపడలేని నా నిస్పృహాయత, అతన్ని ఎదిరించి నిలువలేని నా బలహీనత తప్పించలేకపోయాయి.

దాని ముఖం చూస్తుంటే, కమిలిన ఆ దెబ్బలు దాని వొంటిమీద తేలిన గదుములు చేతులతో రాస్తుంటే 'భగవంతుడా యీ పసిపిల్లకు ఎందుకింత క్రూరశిక్ష, యింతకన్న దీనికి ఏదో రోగమో, రాష్టో వచ్చి నీ దగ్గరికి తీసుకుపోరాదా' అని అనుకున్నాను. ఏ పాపిష్టి తల్లి అయినా తన బిడ్డలను తీసుకుపొమ్మని దేవునికి మొరపెడుతుందా? నా వీపున ఛళ్ళున చరిచినట్టయింది. 'భగవంతుడా అపరాధం మన్నించు. ఈ పిల్లను కాదు నన్ను.... నన్ను....తీసుకుపో తండ్రీ' మనసులోనే విలపించాను.

'పచ్చని పదహారేళ్ళ వయసులో ఆడుతూ, పాడుతూ, మాట్లాడుతూ, తుళ్ళుతూ ఆనందంగా కనిపించాలని, అలంకరించుకోవాలని, పెళ్ళి పేరంటం చేసుకుని ముద్దు ముచ్చటలు తీర్చుకోవాలని, వయసు పోరు తీరుస్తూ మనసెరిగి

మనలుకునే మగవాడి సాహచర్యం కావా లవి ఎవరికి వుండదు. యీ అనుభవా లన్నింటికీ దాన్ని దూరంచేయడానికి అదేం పాపం చేసింది.' అని నేను కుమిలిపోని క్షణం లేకుండా పోయింది.

నాలుగు రోజులపాటు యింట్లోంచి వీధిగుమ్మం దగ్గరకు కూడా వెళ్ళలేదు మంగళ.

ఓ రాత్రి భర్త యిష్టాన్ని కాదనలేక ఆయన చేతుల్లో బందీ అయిన సమ యంలో అనుకోకుండా నా కళ్ళు పెరటి వైపుకున్న కిటికీకేసి తిరిగాయి అక్క డెవరో చాటుగా నుంచుని వున్నట్టు, నేను అటుకేసి చూడటంతో ప్రక్కకు తప్పుకున్నట్టు తోచింది. చివాలున ఆయన్ని విదిలించుకుని లేచాను. కంగా రుగా చీర సరిచేసుకుంటూ కిటికీ సమీ పించి కలయచూశాను. ఎవరూ కనిపించ లేదు గానీ ఎవరో యింట్లోకి వచ్చి పెరటి తలుపు మెల్లగా మూస్తున్న చప్పుడయింది. చప్పున తలుపుకున్న కర్టన్ ప్రక్కకులాగి కన్నంగుండా అవతలకి చూసిన నాకు నిర్ధారణ అయి పోయింది. మంచినీళ్లు తాగుతోంది మంగళ.

ఆ పిల్ల యిట్లా చూస్తూ వుంది అని ఆయనతో చెప్పే ధైర్యం లేక పోయింది. ఆవేళ అలా దాన్ని చావు దెబ్బలు కొట్టినప్పటినుండి యిద్దరూ ఒకరికొకరు ఎదురుపడటంగానీ, ఒక్క మాట యినా పలకరించుకోటం గానీ మానేశారు. బద్ధశత్రువుని యింట్లో వుంచుకున్నట్టుంది ఆయన ప్రవర్తన. యింక యీ విషయం చెబితే....

ఈ క్లిష్ట సమస్యను ఎట్లా పరిష్క రించుకోవాలో తోచటంలేదు. దాని జీవితం మోడువారిపోయింది. యింక యిట్లా ఎండిపోవలసిందేనా. దాని జీవితంలో యింక వసంతం ప్రవేశించి అది చిగురించి కళకళలాడే యోగమే లేదా....

వుంది .... వుంది .... వుంది. నా గుండెలోతుల్లో, మనసు మూలల్లో ప్రతి ధ్వనించింది. ఎలా .... ఎలా .... ఏది మార్గం....

మంగళకి మళ్ళీ పెళ్ళిచేయాలి. ఒక్క క్షణం నా గుండె లయతప్పింది. భయంకర భూతమొకటి చటుక్కున ఎదుట నిలబడినట్టు నా ఒళ్ళు కంపిం చింది.

'అవును....తప్పేముంది .... తప్పే ముంది....' వేయి గొంతుకలతో చుట్టూ నన్ను సమాధానపరుస్తున్నట్టు....ఎంత భయంకర భూతమైనా, చూడటానికి కాసేపు అలవాటుపడ్డాక మనసు కుదుట పడినట్టు నా భయం తగ్గింది. అయినా తలలో సమ్మెటలతో కొడుతున్నట్టు పోట్లు.

పరిష్కారం క్షణంలో తోచింది గానీ అది ఆచరణకు వస్తుందా. నేను

భావించిన విధంగా జరుగుతుందా.... జరగటానికి అవకాశం వుందా....అలా జరిగితే ఎంత బావుండు. యీ గుండెల్లో మోయలేని బాధ, గుండెలపైన మోస్తున్న బరువు కరిగిపోయి....ఎంత బావుంటుంది....క్షణం సేపులో సగంలో మంగళ...నా కళ్ళముందు పెద్ద జడతో... జడనిండా పువ్వులతో....నుదుట ఎర్రని తిలకంతో, కళ్ల నిండుగా కాటుక దిద్దుకుని, చంకలో పిల్లాడు, చేతిలో పిల్లాడుతో ప్రత్యక్షమయి చటుక్కున మాయమైంది. ఆ మిగిలిన సగం క్షణంలో ఎండిన చెట్టులా బండబారిన గుండెలతో దాని ముఖంలో కళ ఏదీ....మోడువారిన చెట్లకు ఏటేటా వసంతం వస్తూనే వుంటుంది. ఆ వసంతం మాత్రం మనిషికి మళ్ళీ రాకూడదా?

ఆరోజు రాత్రి ఎంతో ఎంతో దగ్గరగా, నా అంతట నేను ఎంతో సన్నిహితంగా, ఎంతో యిష్టంగా, మరెంతో భయంగా దగ్గర చేరి నా అభిప్రాయం బయటపెట్టాను. అంతే. ఒక్క విసురుకు నా తల మంచంపట్టెకు కొట్టుకొని కళ్లు బైర్లుకమ్మినట్టయింది. భయంభయంగా ఆయనకేసి చూశాను. అంతకోపం మున్నెన్నడూ ఆయనలో చూసిన జ్ఞాపకంలేదు. ప్రళయకాల రుద్రుడులా వున్నారు. ఆ నోట్లోంచి వచ్చిన ఒక్కోమాటా....

జెష్టముండా....నీవు అసలు బ్రాహ్మణ ముండవేనా అని. ఇది నీ పుర్రెకు పుట్టిన బుద్ధేనా? వంశము, మర్యాద, సాంప్రదాయము పరువు ప్రతిష్టల గురించి ఆలోచించని నీవు ఏంసంసారివే. పిచ్చెక్కిందా....మదమా? ఏమిటే నీ తల తిరుగుడు. ఇట్లాంటి అప్రాచ్యపు మాటలు, అనాచారపు పనులు యీ కొంపలో జరగాలని చూస్తున్నావా. మా యింటావంటా లేవు. నేను బ్రతికుండగా నలుగురిలో తిరగాలా....చస్తే.... మా వాళ్ళతోపాటు పుణ్యలోకాలు చేరాలా. ఈ వెధవముండకు పెళ్ళిచేసి నన్ను ముండ మోపిని చెయ్యాలనుకుంటున్నావా....'

శరపరంపరలా తాకుతున్న మాటల ధాటికి యింకేం పలుకలేకపోయాను. మళ్ళీ మళ్ళీ ఆ అభిప్రాయాన్ని వ్యక్తం చేసే సాహసం నాకు లేకపోయింది.

మంచులాంటి గతం కరిగించి మంగళను బంగారు కిరణాల వెలుగు వంటి భవిష్యత్తులోకి తీసుకురావాలనుకున్న నా కల కరిగిపోయింది.

వయసు పొంగుతో, వాంఛల వుధృతంతో పరుగులుపెట్టే కోరికల స్రవంతిని ఎటూ పోకుండా బంధించి, ఆ తాకిడికి విషాదాన్ని, విరాళను మోయవలసిరావడం ఎంత బాధాకరం. పరుగులెత్తి పారే ఏటికి అడ్డుకట్టలు కడితే అవి బద్దలు కావా?

ఎలా జరిగిందో....ఎలా పెరిగిందో నాకు తెలీదుకానీ ఒకనాడు నేనూ,

ఆయన ఎవరింటికో పెళ్ళి భోజనాలకు వెళ్ళి వచ్చేసరికి యింట్లో మాకు కనిపించిన దృశ్యం నన్ను రాయిగా, ఆయన్ని రాక్షసుడిగా మార్చింది. ఆ పోస్టుకుర్రాడి కౌగిలిలో.... మగవాడి స్పర్శకు పరవశించినదానిలా, తమకంతో కళ్ళు మూసుకుని మంగళ....దాన్ని పొదివి పట్టుకుని నుదురూ, చెంపలూ పెదవులూ ముద్దాడుతున్న ఆ కుర్రాడు ...అప్పుడే వచ్చాడేమో తలుపులు గడియపెట్టటంవరకూ రాలేదు.

మమ్మల్ని చూసి తుపాకీ గుండు శబ్దం విన్న పక్షుల్లా యిద్దరూ బెదిరిపోయారు. ఆ కుర్రాడు నెమ్మదిగా జారుకున్నాడు. ఆయన చూపులకే శక్తి వుంటే మంగళ అక్కడికక్కడే బూడిద అయ్యేది. జరగబోయే ప్రళయం వూహించలేకపోయాను. నా ఒంట్లో విస్పత్తువ, నాకు తెలీని బలహీనత. నాలో శక్తే లేదు. ఒళ్ళంతా తేలిపోతున్నట్టు, ఒంట్లోని రక్తమంతా పాదాల్లోకి జారిపోతున్నట్టు అనిపించింది. అలాగే నేలమీద కుప్పకూలిపోయాను.

నాకు స్పృహ వచ్చేసరికి హృదయ విదారకమయిన రోదనలు, గుండెలు చీల్చుతున్నట్టు మాటలు. లేని శక్తి తెచ్చుకుని తలుపులు మూసిన గదిని చేరుకున్నాను. పరుగే పెట్టానేమో. లోపల గడియ వేసి ఉంది. శక్తికొద్దీ తలుపులు బాదాను. విఫల ప్రయత్నం చేసి ఓడిపోయాను. నా గుండెల్లోంచి ఏడుపు తన్నుకు వస్తోంది. ఆ రోదనలు నన్ను చిత్రవధ చేస్తున్నాయి. నా కడుపులో దేవినట్టు వుంది. తలుపులు బాదిబాది నీరసించి ఆ తలుపులకు అలాగే చేరగిలబడిపోయాను. మంగళ ఏడుపు నా గుండెల్ని చీల్చుకుపోతోంది. నా హృదయం బ్రద్దలయిపోతుందేమో....

'చంపేస్తారా....యివాళ దాని అంతం చూస్తారా' భయంకరమైన ఆ వూహ నాకు పిచ్చిబలం యిచ్చింది.

తలుపులు బద్దలయ్యేలా బాదాను.

"తలుపు తీస్తారా? వీధిలో నలుగురినీ కేకేయనా." గొంతు చించుకుని అరిచాను. మరునిముషంలో దఢాలున తలుపు తెరుచుకుంది ముందుకు తూలి పడబోయి నిభాయించుకున్నాను. కరకు కసాయిగుండె నన్ను దూసుకుంటూ బయటికి పోయింది. కరిగి నీరయిపోతున్న గుండెతో లోపలికి వెళ్ళాను నేను. మంగళ, నాబిడ్డ, నా కన్న తల్లి శవంలా నేలమీద పడివుంది. దాని ఒంట్లో ప్రాణం వుందో...పోయిందో... 'భగవంతుడా యీ నిర్భాగ్యురాలయిన కన్నతల్లికి కాస్త నిబ్బరం ప్రసాదించు తండ్రీ' అని ప్రార్థిస్తూ నేలమీద కూలబడి దాని తలను నా ఒడిలోకి తీసుకున్నాను. స్పృహలేదు. అయినా మూలుగుతోంది. మనసుకు, మెదడుకు కూడా అతీతమైన శరీరబాధ అది.

మంగళ ఒంటికేసి పరకాయించి చూసిన నా గుండె చెరువయింది. దాని ఒళ్లు ఎర్రగా వాతలు తేలివుంది. చేతుల మీద, మెడమీద, బుగ్గలమీద, పాదాల పైని....చీర అంచులను వణుకుతున్న చేతులతో కాస్త పైకి జరిపాను. కాళ్ళ మీద....పిక్కలమీద....అవి దెబ్బలు కావు. కొడితే పడే వాతలు కావు. మరి....మరి....అప్పుడే ఆ ప్రక్కగా పడివున్న యినప గరిట....కాడ బాగా కాల్చినట్టు వుంది. వంటింట్లో వుండే విష్ణుగరిట .... అర్థమయ్యింది. యివి యివి ఆ గరిటతో కాల్చిన వాతలు. మనసులో అల్లరిపెట్టి, శరీరంలో గిలిగింతలు పెట్టిన కోరికలకు లొంగి పొంగిన నరాలకు శిక్ష అది.

నా గుండె తరుక్కుపోయింది. కట్టలు తెంచుకుని వచ్చింది దుఃఖం. నా మంగళమీదపడి భోరున ఏడ్చాను. ఇంతటి శిక్షకు గురిచేసిన ఆయన కన్న తండ్రా? కసాయివాడా? నా బిడ్డ ఎంతగా అల్లాడిపోయిందో. ఒళ్ళంతా ఒక్కొ చోటా వాతలు పెడుతూంటే తండ్రి కాళ్లను చుట్టేసుకుని బ్రతిమలాడిందో, సహాయం వచ్చి అడ్డుపడుతుందేమోనని తల్లి కోసమే కన్నీళ్ళతో కలయచూసిందో యింతకన్నా ఒక్కసారి నాకు చావు రానివ్వు దేవుడా అని కనికరంలేని ఆ భగవంతుడినే ప్రార్థించిందో .... ఎంతగా విలపించిందో....ఒక్కొ వాతా చురుక్కున పడుతూంటే ఎంత విల విల్లాడిందో...తలుచుకొని తలుచుకొని... నా మనసు కుమిలి కుమిలి పోయింది. నా గుండె కాలిపోయింది.


కొబ్బరినూనె పట్టుకొచ్చాను. దాని ఒళ్ళంతా రాస్తూంటే 'ఎన్నో సుఖాను భూతులతో పరవశించిపోవలసిన యీ అందమైన లేత శరీరం యింత శిక్షకు గురికావటానికి చేసిన నేరమేమి?'

భౌతికంగా మారిన బ్రతుకుబాటతో పాటు అంతరంగమూ మారకపోవటమా? చచ్చిన ఆ మొగుడితోపాటు తన కోరిక లనూ సమాధిచేసుకోలేక పోవటమా?

కోరుకునేవి, పొందవలసినవి విధి వంచితులై పోగొట్టుకొనినపుడు, అలాంటి వాటిమీద వాంఛలు కూడా ఆనాడే చచ్చిపోయేలా వరమీయకూడదూ ఆ దేవుడు. అప్పుడీ నరకం, యింత క్షోభ వుండేవి కాదుకదా.

కళ్లు మెల్లిగా విప్పి నా ముఖంలోకి చూసింది మంగళ. ఆ చూపు బాణం దెబ్బతిన్న లేడికూన చూపులా నా గుండెను పిండేసింది.

"మంగళా!....తల్లీ ...." దాని తలని నా రొమ్ములకేసి అదుముకున్నాను. దాని గుండెలు ఎగిసెగసి పడుతున్నాయి. నా గుండెలమీద పమిట తడిసిపోతోంది. ఓదార్చే శక్తిలేని నేను దానితోపాటు ఏడుస్తున్నాను. ఒకందుకు మంగళ ....




మరొకందుకు నేను యిద్దరం దిక్కులేని పక్షుల్లా విలపించాము.

మంగళ ఏడుస్తోంది. ఎందుకు? కొర నోములు నోచి తన బ్రతుకు సౌభాగ్యం యౌవనపు తొలిమెట్టు మీదనే కాలిపోయినందుకా? పోగొట్టుకున్న సౌభాగ్యంతోపాటు మనసులో శరీరంలో చెలరేగే వాంఛల వుధృతాన్ని తట్టుకోలేక పోయినందుకా? .... కన్నతండ్రి తన మనసును అర్థంచేసుకోలేక తన వయసుని గురించి ఆలోచించక తనను హింసించినందుకా? సాంప్రదాయాల పేరిట తన గొంతుకోసి బ్రతికుండగానే సమాధి చేస్తున్నందుకా....ఎందుకని ....

అసలు నేనెందుకు ఏడుస్తున్నాను. ఎన్నింటికో ఏడుస్తూనే వున్నాను. కారణాలు బోలెడు. కాని యిప్పుడు మాత్రం ఒకటే ఒకటి నన్ను ఏడిపిస్తోంది.

పరవశించేందుకు, పరవశించి పోతున్నందుకు, ప్రేమతో, మోహంతో, కృతజ్ఞతతో నా ఒంటిమీద పడే ముద్రలకు, క్షణంసేపు పరవశించినందుకు దాని ఒంటిమీద పడిన ముద్రలకు ఎంత తేడా. చేసిన పని ఒకటే అయినా ఫలితాలు మాత్రం పరస్పర విరుద్ధంగా ఒకరిమీద అమృతాన్ని, మరొకరిపై అగ్నిని కురిపించడానికి కారణమేమిటి? ఇద్దరు చేసిన ఒకటే పని ఒకరి ఎడ నేరము, మరొకరి ఎడల పవ్యము కావడానికి ఏది కారణం. 'సంఘమా? సాంప్రదాయమా?' పెరగలేని మన మనసులా? తరిగిపోతున్న మానవత్వమా....ఏది....ఏది....ఏది?

ఆ రాత్రి ఎలాగయినా ఆయన మనసుని చల్లబరచాలని, ఆ చల్లదనంలో మేమందరం పేద తీర్చుకుని, ప్రశాంతిగా బ్రతికేలా చేయాలని, ధృఢ నిశ్చయంతో ఆయనని సమీపించాను. కాని .... కాని అప్పటికే మండుతున్న నా గుండెలో మరింత ఆజ్యం పోశారు. రగులుతున్న నా గుండెలు పగిలిపోతాయేమో ననిపించింది ఆయన మాటలు విన్న తరువాత. నా తలమీద పిడుగుపడినట్టు, యింతవరకూ హృదయంలో మాత్రమే జ్వలిస్తున్న యీ మంటలు యిప్పుడు శరీరాన్నంతా దహిస్తున్నట్టు తోచింది.

నా కాళ్లలో శక్తి పన్నగిల్లిపోయి కూలబడిపోయాను. ఆ మంటలకు అన్నాళ్ళుగా నా గుండెల్లో పేరుకు పోయిన బాధ, ఆవేదన కరిగి, కరిగి, లావాలా వుడికి వుడికి నా కళ్ల వెంబడి ప్రవాహంలా వెలువడింది అసమర్థురాలిలా, దిక్కుతెలియని దానిలా కాసేపు ఏడ్చాను. తరువాత పిచ్చిదానిలా లేచాను.

"వీల్లేదు....వీల్లేదు....అలా జరగడానికి వీల్లేదు." గొంతు చించుకున్నట్టుగా, కంఠనాళాలు తెగిపోతాయన్నట్టు అరిచాను.

"నోర్మూయ్. నీవు గింజుకు చచ్చినా జరిగి తీరుతుంది," అంటూ విసురుగా వెళ్లబోయారు. చప్పున ఆయన కాళ్ళను పెనవేసుకున్నాను. ఆ పాదాలమీద నా తల బాదుకున్నాను.

"వద్దండీ. వద్దు....పసిపిల్లమీద యీ విధంగా కక్ష సాధించొద్దు. దాన్ని కన్నతండ్రి మీరు. రాక్షసులుగా మారకండి....ఆలోచించి చూడండి."

"అంతా ఆలోచించే చెప్పాను. నేను చెప్పినట్లు జరిగి తీరుతుంది. ఆ పాపిష్టి ముండకి అదే శాంతి...." చరచరా నన్ను వదిలించుకొని వెళ్లిపోయారు.

'అదే శాంతి...అదే శాంతి...' చెవిలో గింగురుమంటోంది ఆ కంఠం. దానికదే శాంతా.... అది చేసిన నేరానికి అదే శిక్షనా? యిప్పుడు ఆ నేరం చేసినందుకా? జన్మలో మళ్ళీ మళ్ళీ అలాంటి నేరం చేయకుండా వుండేందుకా? కాక అసలు అలాంటి నేరంచేసే అవకాశమే రాకుండేందుకా? ఎందుకు.... ఎందుకు....

బ్రాహ్మడితో మాట్లాడి వచ్చారుట. యివ్వాల్టికి మూడోరోజున తెల్లవారు ఝామున్నే దాన్ని తీసుకుపోయి....

కన్నతల్లిగా నేను దాని ముఖం చూడగలనా? తల నిండా పువ్వులు తురుమవలసిన యీ చేతులతో దాని తలమీద ముసుగు సవరించగలనా? తుమ్మెద రెక్కలాంటి ఆ జుట్టు, త్రాచుపాములాంటి ఆ జడ ఏటిపాలు చేసి మొండి చేతులతో, కళావిహీనమయిన ముఖంతో తల గుండుచేసుకుని ముసుగు వేసుకువివచ్చే నా బిడ్డను... నా మంగళను ఎలా చూడను? 'అమ్మా.... సర్వమంగళా.... నీపేరు పెట్టుకున్నానే

తల్లీ. ఈ పాపిష్టి కళ్ళతో దాన్ని యిలా చూడాలని వ్రాసివుందా?'

'ఇంత దారుణమయి నహింసకు గురి చేయటానికి అదిచేసిన ఘోర అపరాధ మేమిటి? ఆ అపరాధానికి మన్నింపు లేదా. ఎందుకట్లా చేసింది. ఆలోచించి చూడట మనేది లేదా. పెళ్ళికాగానే భర్తపోవటం దాని నేరమా? వయసులో పొంగే వాంఛ లను అరికట్టలేకపోవటమే నేరమా? దాని ముందే గదితలుపులు మూసుకుని లోపల చేరి ఒళ్లుమరిచి కులికే తలిదండ్రు లుండుటకు నేరమా.

'అణుచుకోలేక ఎగసెగసి పడే కోరి కలను మరింత రెచ్చగొడుతూ, అది తెగించటానికి, తను రోజూ చూసే అలాంటి అనుభవం తానూ పొందాలను కోటానికి దోహదం చేసిన తల్లిదండ్రు లకు యే శిక్షలేదు ఆ ప్రభావానికి లొంగి పోయినందుకు మాత్రం దానికదే శిక్ష.... అదే తగిన శాంతి ... మరో విధంగా దాని వయసుకు, మనసుకు, మనుగడకు, ఒక తోడుని వెతికి పెడితే, దాని జీవితం లోకి మళ్ళీ వసంతం రప్పిస్తే.... అది శాంతి కాదా.... కాని శాంతిని కలిగించ టానికి, ఆ వసంతం రప్పించటానికి ఆ కన్నతండ్రే వ్యతిరేకి అయ్యాడే.

"అదే శాంతి....అ....దే....శాం.... తి...." పమ్మెట పోట్లలా ఆ మాటలే నా గుండెలను పగలగొడుతున్నాయి.

మరో విధంగా శాంతి లేదా.... లేదా.... లేదా.... లేదా.... 'వుంది' నా గుండెల్లో ఏ మారుమూలనుంచో కేక....

* * *

ఈ రోజు గడిచిపోయి రేపు వచ్చే సరికి ఆ రేపును తలుచుకుంటుంటే ఏదో ప్రళయం ముంచుకు వస్తున్నట్లు భయంగా వుంది. తుపాను వచ్చి ముంచేసి తుడి చేసుకు పోతుందన్నంత బాధగా వుంది.

"తలంటు పోసుకో మంగళా" ఎంతో మామూలుగా చిరునవ్వు నవ్వుతూ అన్నాను. ఆ చిరునవ్వు వెనుక ఎంత భయంకరపు టాలోచన మెదులుతూందో ఎలా తెలుసుకోగలదు?

"ఇవాళ ఎందుకమ్మా. పైగా నాన్న వూరెళ్లారుకూడా పొద్దుటే." అమాయ కంగా అడిగింది.

ఆ నాన్న ఎందుకు వెళ్లాడన్నది.... వెళ్ళిన నాన్న తిరిగి వచ్చాక తనకు యిక తలంటుపోసుకునే అవసరం వుండదని దాని తెలియటంలేదు. తెలిసిన నేను నాలో నేనే దహించుకు పోతున్నాను.

"ఇవాళ నీ పుట్టినరోజు మంగళా. మరిచిపోయావా?" నా గుండెల్లో నుంచి ప్రేమ పొంగుతోంది. బయటికి ప్రవ హిస్తోంది.

ఆ సాయంత్రం అలలు అలలుగా రేగిన ఆ జుట్టుని మెత్తగా దువ్వి జడ

నేనే అల్లాను. అల్లుతున్న ఆ వెంట్రుకలను నా కన్నీళ్లు తడుపుతున్నాయి. నాచేతులు మరీ మరీ ఆ మెత్తదనాన్ని తడుముతున్నాయి.

పెరట్లో పువ్వులన్నీ కోసి రోజూ లాగే దండ కట్టుకొచ్చి నా దోసిట్లో వుంచింది.

"మంగళా అటు తిరుగు"

"అమ్మా! యిదేంటి?" దాని తలలో తురుముతున్న పువ్వులనూ, నా చేతులనూ కూడా గట్టిగా పట్టుకుంది.


"వుండనీ మంగళా. యివాళ ఒక్క రోజు వుండనీ. ఎందుకని అడగకు వద్దని తీసివేయకు. ఎందుకో విన్నాకసారి యిలా చూడాలనిపించింది. ఇవాళ నీ పుట్టిన రోజు కలిసి వచ్చింది నీవు పుట్టిన రోజున నీ జీవితం సర్వశోభాయమానంగా వెలగాలని 'సర్వమంగళ' అని నీకు పేరు పెట్టుకున్నాను. నా ఆశలు కూలిపోయాయి. మూడుపువ్వులు ఆరు కాయలుగా వృద్ధిపొందుతుందనుకున్న నీ జీవితం మొగ్గలోనే రాలిపోయింది. కనీసం యీ పుట్టిన రోజున విన్ను మంగళకరంగా నా కళ్లార చూసుకోనీ తల్లీ!" మంగళ భుజాలు పట్టుకొని దాని కళ్లలోకి చూస్తూ అన్నాను. నా కళ్లలో దాగిన అభ్యర్ధన, నా మాటల్లో వెలువడుతున్న అంతరంగం దానికి తెలుస్తూనే వుంది. అయినా....

"నాన్న వస్తే...." ఆశ వ్యక్తమవుతున్నా దానిని మింగుతూ భయం.

"ఇప్పుడప్పుడే రారు. రాత్రి పది గంటల పైనే. అప్పటికి తీసేయొచ్చులే"

నా అభయంతో మంగళ ముఖం వెలిగిపోయింది. కళ్లు తళతళ లాడాయి. "నిజంగానా అమ్మా" అంటూ అద్దం ముందుకు పరుగెట్టింది. వెనక్కీ ముందుకీ జరుగుతూ పదిసార్లు చూసుకుంది. జడనీ, పూలనీ అటూ యిటూ సవరించుకుంది. పూలు పెట్టుకోవడం మరిచిపోయినదానిలా, పువ్వులకి మొహం వాచిపోయినదానిలా, అసలు పూలంటే యిప్పుడే చూస్తున్నదానిలా వెల్లివిరిసే ఆనందం కొన్ని క్షణాలపాటయినా తనకు యీ అవకాశం దక్కినందుకు సంరంభం.

వణుకుతున్న చేతులతో తిలకం తీసి దాని నుదుట బొట్టుదిద్దాను. కొత్త పెళ్ళి కూతురిలా కూచునివుంది మంగళ. దాని మనసు వుప్పొంగి పోతోంది. ఆ ఆనందం క్షణికమే అని తెలిసినా, అలాంటి క్షణం దొరికినందుకే మురిసిపోతోంది. కళ్ళకు కాటుక తీర్చాను. ఆ రూపం ఎంతో సమ్మోహనకరంగా శోభాయమానంగా వెలిగిపోతోంది ఒక్క బొట్టూ, కాటుకతోనే ఎన్నో అలంకారాలు వచ్చి చేరినట్టు 'సర్వమంగళ' లాగే వుంది. నా కన్నుల పండువుగా తనివి తీరా చూసుకున్నాను నా మంగళను.



జ్ఞాపకం వచ్చింది. చటుక్కున వెళ్ళి దాని పెళ్లిచీర తెచ్చాను...జరీబుట్టాల తెల్ల చీర తెచ్చాను. చిన్న పాపలా గంతులు వేసింది మంగళ. "మా అమ్మ ఎంత మంచిది," పెళ్ళిచీర కట్టుకుని నన్ను కౌగిలించుకుంటూ సంతోషం పట్టలేక నా బుగ్గమీద ముద్దుపెట్టుకుంది.

"అవును మంగళా! మీ అమ్మ చాలా మంచిది." అన్నాను నేను నవ్వుతూ. పదేపదే తన అలంకరణను సవరించు కుంటూ, యిప్పుడు పోగొట్టుకుంటే యిక జీవితంలో యీ క్షణాలు రావన్నట్టు తనివితీరా తనను తాను చూసుకుంది అద్దంలో చాలాసేపు. భోజనానికి పిలిచే వరకూ అసలు అద్దంముందు నుంచి అసలు కదల్లేదు.

అయాచితంగా లభించిన ఆ సంతోష కాలపరిమితి చాల స్వల్పమే అయినా ఎన్నో ఏళ్ళకు సరిపడేంతగా గుండెల నిండా ఆనందం నింపుకున్నట్టు దానికి భోజనం సయించలేదు.

పక్కలు పరుచుకున్నాక మంగళ ముఖంలో దైన్యం చోటుచేసుకుంది. తన సర్వస్వం కాపేపట్లో ఎవరో దోచు కుంటా రన్నట్టు.

"అమ్మా! నాన్న వచ్చేస్తారేమో. యిక తీసేయనా?"

నా కళ్లలో జల వూరుతోంది. బల వంతాన నిగ్రహించుకుంటున్నాను.

"వద్దులే. యింకా సేపు వుండనీ మీ నాన్న వచ్చి తలుపు తడుతారుగా. అప్పుడు తీయొచ్చు."

లాక్కుపోతారేమోనని భయపడు తున్నపుడు ఆ ప్రియమైన దానిని నీకు నీవే వుంచేసుకో అన్నట్టు సంతోషం తొంగిచూపి పోంగింది.

పక్కమీద వెల్లికిలా పడుకున్న మంగళను చూస్తూ చాలాసేపు అలాగే వుండి పోయాను. దాని ముఖంలో యీ మాత్రం అనుభవానికే ఆనందం వెల్లివిరుస్తోంది, పట్టుచీరెలో....తలనిండా పువ్వులతో.... త్రాచుపాములాంటి జడతో, నుదుట కుంకుమబొట్టుతో కొత్త పెళ్ళికూతురిలా కళకళలాడిపోతున్న యీ మంగళ రేపు ఎలా వుంటుంది?

ఆ బారు జడను కోల్పోయి....తల గుండుచేసుకుని గుండుమీద ముసుగు వేసుకుని....ఎంత దారుణమయిన మార్పు వాళ్ళ నాన్న చేసిన యీ ఆలోచన యీ క్షణాన దానికి తెలిస్తే దాని గుండె బ్రద్దలవదూ. యీనాడు ఈ తల్లి ఆదరణలోని ఆంతర్యం అది తెలుసుకో గలిగితే....

గ్లాసుతో పాలు పట్టుకొచ్చాను. కళ్ళు మూసుకుని ఏవో ఊహాలోకాల్లో విహరిస్తోంది.

"పాలు తీసుకో మంగళా."

వింతగా చూసింది నావేపు. తన కలలకు అడ్డువచ్చినట్టు యిబ్బందిగా ముఖం పెట్టింది.

"యిప్పుడెందుకమ్మా ఎప్పుడూలేని అలవాటు."

"చూడు మంగళా! నీవు పుట్టిననాడు నా రొమ్ముల్లో పాలుపట్టాను. నీ మొదటి పుట్టినరోజున బంగారుగిన్నెలో పాలు త్రాపాను. నీ పెళ్ళిరోజూ నీ మొదటిరాత్రి నీవు నూతన జీవితంలోకి అడుగుపెట్టే ఆ తరుణాన పాలగ్లాసు నీ చేతిలో పెట్టి విన్నో జీవితంలోకి నెట్టి తలుపులు మూశాను. ఇవాళ మళ్ళీ చాలా రోజుల తరువాత యీ నీ పుట్టిన రోజునాడు నీకు శుభం కలగాలని, నీకు నూతన జీవితం ప్రసాదించబడాలని, ఆ జీవితంలో తియ్యదనమే తప్ప చేదుండ కూడదని, నీవు సౌభాగ్యవతిగా వుండేలా చేయమని ఆ భగవంతుని ప్రార్థిస్తూ పాలు నీ నోటికి అందిస్తున్నాను. భగ వంతుడనేవాడుంటే నా మొర ఆలకిస్తా డనే అనుకుంటున్నాను. త్రాగు మంగళా నీవూ ఆ భగవంతుడిని అలాగే కోరుతూ త్రాగేయి."

నా చేతులు వణుకుతున్నాయి. నా కంఠంలో దుఃఖం సుళ్ళు తిరుగుతోంది. మంగళ నాకేసి ప్రేమగా ఒక క్షణం చూసింది. గ్లాసు అందుకుంది. గటగటా త్రాగేసింది.

"ఇప్పుడు నీకు తృప్తిగా వుందికదూ అమ్మా" ఆరాధనగా నా కళ్ళలోకి చూసింది.

"నిజం మంగళా యిప్పుడు నాకెంతో ...ఎంతో...చెప్పలేనంత తృప్తిగావుంది. నా గుండెలమీదినుంచి ఏదో బరువు దించుకున్నంత తృప్తిగా వుంది. అలాగే పడుకుని నిద్రపో. మీ నాన్న వస్తే లేపుతాను. భయపడకుండా....దిగులు పడకుండా....నీ వూహలోకాల్లోకి వెళ్ళిపో. అక్కడ నీవు కలలు కనే లాంటి జీవితమే నీకు ప్రసాదించాలి ఆ భగవంతుడు...." సుళ్ళు తిరుగుతూన్న దుఃఖం పొర్లి వస్తోంది. అది ప్రవాహంగా మారడానికి యింక ఎంతసేపో పట్టదు.

"అమ్మా .... అదోలా మాట్లాడు తున్నావు...."

"ఏంలేదుగానీ నువు పడుకోమ్మా."

మలచిన విగ్రహంలా సర్వశోభాయ మానంగా మంగళ....నా సర్వమంగళ నిద్రపోతోంది. ఆ నిద్రకు యింక మెలకువనేది లేదని నాకు మాత్రమే తెలుసు. క్షణం క్షణం దాని జీవితం నరకం చేయటంకన్న, దాన్ని చూస్తూ ప్రతిక్షణం నేను నరకం అనుభవించటం కన్నా యిదే హాయి కదూ.

మంగళ కయితే యీ నరకంనుంచి విముక్తి కలిగించాను. కాని నాకేదీ.... మిగిలివున్న ఆ పిల్లలతో, సాంప్ర దాయపు ముసుగునుంచి బయటపడని ఆ చాదస్తపు భర్తతో యింకా యింకా ఎంత అనుభవించాలో. ఆ పిల్లల పాశమే నన్ను బంధించకపోతే మంగళని ఒంటరిగా వెళ్ళనిచ్చేదాన్ని కాదు.

భగవంతుడా! ఎలాంటి ఆడపిల్లకూ మంగళలాంటి జీవితం ప్రసాదించకు. ఇంకే ఆడపిల్లలను మాలాంటి మూఢుల యింట్లో పుట్టించకు. అలాంటి మంగళలు యిప్పటికే వుంటే వాళ్లను కన్నతల్లి నాలాంటి నిర్భాగ్యు రాలో కాకుండా బూజుపట్టిన ఆ సాంప్ర దాయాలతో, వాటిని పట్టుకుని వ్రేలాడు తున్న మనుషులతో పోరాడి ఆ శృంఖ లాలు తెంచుకునే శక్తిని ప్రసాదించు.

అలాంటి మంగళలు వున్న తలి దండ్రులు మూఢవిశ్వాసాలకు మూఢా చారాలకు తమ పిల్లలను బలిపెట్టకుండా మారుతున్న కాలంతోపాటు తామూ మారి, మానవత్వాన్ని పెంపొందించుకుని ప్రేమలను పంచి తమ పిల్లల జీవితం లోకి మళ్ళీ వసంతం తెప్పించి నూతన జీవితాల్ని ప్రసాదించేంత గొప్పమనసును అనుగ్రహించు."

ఎంతసేపు అలా కూర్చున్నానో నాకే తెలియదు

బయట తలుపుతట్టిన చప్పుడు. నీళ్లు నిండిన కళ్ళకు మంగళరూపం మసకగా కనిపించటంతో రెప్పలు తాటించి వాటిని బుగ్గలమీదకు జార్చేసి కళ్లు విప్పార్చు కుని కళ్ళనిండుగా మరొక్కసారి మంగళని చూసుకుని నడుస్తున్న శవంలా కదిలివెళ్లాను తలుపు తీసేందుకు.

———